సాక్షి చిత్తూరు

సోమవారం । 18 । మార్చి । 2024



మహిళలకు పెద్దపీట

సీఎం జగనన్న మహిళలకు పెద్దపీట వేస్తున్నారని మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. - 8లో



నిష్పక్షపాతంగా ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
చిత్తూరు	6.29	4.58
పుంగనూరు	6.30	5.01

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సాబ్‌జాన్‌సాబ్

రామకుప్పం: తెలుగుదేశం పార్టీకి చెందిన మండల మైనారిటీ కన్వీనర్ సాబ్‌జాన్‌సాబ్ ఆదివారం ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఆయనకు ఎమ్మెల్సీ భరత్ పార్టీ కండవా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన సాబ్‌జాన్‌సాబ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు తెలిపారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపించడమే లక్ష్యంగా మైనారిటీలు పని చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు అశోక్ రెడ్డి, వేణుగోపాల్ గౌడు, తాజ్ బాషా పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు హాజరైన అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలకు అనుమతించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పేపర్-1 పరీక్షకు 2517 మంది అభ్యర్థులకుగాను 1510 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించిన పేపర్ 2 పరీక్షకు 2517 మందికిగాను 1502 మంది అభ్యర్థులు హాజరైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

భక్తులతో కిటకిటలాడిన కాణిపాక ఆలయం



భక్తులతో నిండిపోయిన క్యూలైన్లు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో ఉదయం నుంచి స్వామివారి దర్శనార్థం భక్తులు తరలి రావడంతో రూ.150, రూ.100, ఉచిత క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తగు చర్యలు తీసుకుని భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు
- రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఆర్వో శ్రీనివాసులు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాటుల చేస్తున్నట్టు రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో 2,23,104 ఓటర్లు ఉన్నారని, వీరిలో 1,11,231 పురుషులు, 1,11,855 మహిళలు ఉన్నారని చెప్పారు. నాలుగు మండలాల్లో 243 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని, 58 బూత్‌లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు చెప్పారు. ఈ సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేకంగా వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, సూక్ష్మ పరిశీలకులతో పాటు కేంద్ర బలగాలను ఏర్పాటు చేశామని, ఎన్నికల నిర్వహణకు 24 మంది సెక్టోరల్ ఆఫీసర్లను, అలాగే పీఓలు, ఏపీఓ, ఓపీఓలుగా సుమారు 2,500ని ఎన్నికల విధులకు నియమించినట్లు చెప్పారు. ఇక శాంతి భద్రతల పరిరక్షణకు 949 మంది పోలీసులను ఎన్నికల విధులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, కుప్పం తహసీల్దార్ హరికుమార్ పాల్గొన్నారు.



మదనపల్లెలో టమాటాను పొలాల వద్దనే విక్రయించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు(ఫైల్)



చిత్తూరు మార్కెట్‌లో బెల్లం అన్‌లోడ్ చేస్తున్న కూలీలు(ఫైల్)

కష్ట కాలంలో.. ఆనందంగా సాగు!

దేశ వ్యాప్తంగా దాదాపు రెండేళ్లపాటు కరోనా మహమ్మారి జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. లాక్‌డౌన్ విధించడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో జనజీవనం కేవలం ఇళ్లకే పరిమితమవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా ఆదుకునేందుకు సత్వర చర్యలకు శ్రీకారం చుట్టారు. వెంటనే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసి ప్రజలతో పాటు ప్రత్యేకంగా రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచారు.

కరోనా వేళ రైతుకు జగనన్న సర్కారు వెన్నుదన్ను

- పంటలకు గిట్టుబాటు ధర
- కోళ్లు, పాడి పరిశ్రమలకు చేయూత
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

చిత్తూరు అగ్రికల్చర్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో రైతులు ఖరీఫ్‌లో 2.21 లక్షల హెక్టార్లలో పంటలు సాగుచేస్తారు. పడమటి ప్రాంత మండలాల రైతులు వేరుశనగ పంటను 1.36 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగుచేస్తారు. రబీలో 90 వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో అన్ని రకాల పంటలు సాగు చేయగా, పడమటి మండలాల రైతులు వరిని దాదాపు 40 వేల హెక్టార్లలో సాగుచేస్తారు. అదేగాక ఏడాదికి మూడు దఫాలుగా పడమటి మండలాల పరిధిలోని రైతులు టమాట పంటను 30 వేల హెక్టార్లలో సాగుచేస్తారు. వార్షిక పంటలుగా చెరుకు27 వేల హెక్టార్లు, మామిడి 1.12 లక్షల హెక్టార్లలో సాగుచేస్తారు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. అయితే కరోనా లాక్‌డౌన్ సమయంలో దిగుబడి అయిన పంటను విక్రయించుకోలేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టి రైతుకు వెన్నుదన్నుగా నిలిచింది.

పంట కొనుగోలు ఇలా..

కరోనా సమయంలో టమాట రైతును ఆదుకునేందు కు ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి నుంచి గిట్టుబాటు ధర కల్పించింది. టమాట పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి గుజ్జు పరిశ్రమలకు తరలించింది. ఇతర జిల్లాల్లో రైతు బజార్లలో విక్రయించే విధంగా చర్యలు చేపట్టింది. ఇందులో రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే భరించింది. ఇది పడమటి మండలాల రైతులకు ఎంతో మేలు చేకూర్చింది.

మామిడి..

మామిడిలో టేబుల్ వెరైటీ కాయలను చైనా, జర్మనీ, న్యూజిల్యాండ్, నెదర్లాండ్, లండన్, దుబాయ్, కెనడా, మలేషియా, స్విట్జర్లాండ్ తదితర దేశాలకు కార్గో విమానాల ద్వారా ఎగుమతి చేశారు. దీంతో కిలో కాయలకు రూ.50 నుంచి రూ.75 వరకు రైతులకు గిట్టుబాటు ధర లభించింది. తోతాపురం రకం కాయలను కూడా గుజ్జు పరిశ్రమలకు తరలించే వెసులుబాటు కల్పించింది.

వరి, వేరుశనగ..

వరి పంటను కొనుగోలు చేసేందుకు జిల్లాలో మొత్తం 16 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో ఏ గ్రేడు వరికి క్వింటాళ్‌కు రూ.1,831, సాధారణ రకానికి రూ.1,815 చొప్పున ధర నిర్ణయించారు. దాదాపు 30 వేల హెక్టార్లలో దిగుబడి అయిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. అదేవిధంగా వేరుశనగ కాయలను కిలో రూ.61 చొప్పున కొనుగోలు



ములకలచెరువులో పొలాల్లోనే క్యారెట్‌ను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు (ఫైల్)

చేసింది. దాదాపు 75 వేల క్వింటాళ్ల మేరకు కొనుగోలు చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, ములకలచెరువు మండలాల పరిధిలో దాదాపు 100 ఎకరాల్లో రైతులు క్యారెట్‌ను సాగుచేశారు. ఆ ప్రాంతాల రైతుల నుంచి కిలో రూ.13 చొప్పున పొలాల వద్దకే వెళ్లి కొనుగోలు చేశారు. దాదాపు 700 టన్నుల మేరకు క్యారెట్‌ను కొనుగోలు చేసి రైతు బజార్లకు తరలించారు. అలాగే జిల్లాలో సాగైన దాదాపు 25 వేల హెక్టార్లలోని పండ్లు, కూరగాయలను కొనుగోలు చేశారు. డ్వాక్రా సంఘాల మహిళల సహకారంతో అరటి 1,362 హెక్టార్లలో, దోస 1,277, కర్బూజా 1,096, జామ 556, సపోటా 300, కూరగాయలు 17 వేల హెక్టార్ల మేరకు దిగుబడి అయిన పంటను కొనుగోలు చేసి విక్రయించారు.

పాల ఎగుమతి ఇలా..

పాడి రైతుకు జగనన్న ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. పాల ఎగుమతికి వెసులుబాటు కల్పించింది. నిత్యం తమిళనాడులోని పాల డెయిరీల్లో పాల పొడి తయారీకి 2.5 లక్షల లీటర్ల మేరకు ఎగుమతికి అవకాశం కల్పించింది. అదేగాక ఢిల్లీకి వారానికి 8 లక్షల లీటర్ల పాలను ఎగుమతి చేసి ఆదుకుంది. దీంతో ఆవు పాలకు లీటరుకు రూ.25 నుంచి రూ.30 వరకు, గేదె పాలు రూ.50 వరకు రైతులకు గిట్టుబాటు అయ్యింది.

బెల్లం..

జిల్లాలో తయారయ్యే నల్లబెల్లం కిలో రూ.50, తెల్ల బెల్లం కిలో రూ.60 వరకు ధర పలకడంతో రైతులకు మంచి ధర దక్కింది. జిల్లా నుంచి దాదాపు 15 వేల టన్నుల మేర తరలించి ఆదుకుంది.

కోళ్ల పరిశ్రమ..

కోళ్ల పరిశ్రమపై దాదాపు 2,500 మంది రైతు కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. లేయర్ కోళ్లు దాదాపు 80 లక్షలు, బ్రాయిలర్ కోళ్లు (ఇంటిగ్రేటెడ్ కింద) 1.20 లక్షల మేరకు పెంచుతున్నారు.

పట్టుగూళ్లు..

జిల్లాలో దాదాపు 30 వేల మంది రైతులు మల్బరీని దాదాపు 45 వేల హెక్టార్లలో సాగుచేస్తున్నారు. కరోనా సమయంలో పక్వానికి వచ్చిన పట్టుగూళ్లను విక్రయించేందుకు వీలుగా ప్రభుత్వం కుప్పం, మదనపల్లె, పలమనేరులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో రైతులు రోజుకు 11 టన్నుల మేరకు పట్టుగూళ్లను విక్రయించుకున్నారు. కిలో పట్టుగూళ్లను రూ.250 నుంచి



పలమనేరు కొనుగోలు కేంద్రంలో పట్టుగూళ్లను విక్రయించుకుంటున్న రైతులు (ఫైల్)

రూ.300 వరకు విక్రయించారు. అంతేగాక బెంగళూరుకు తరలించుకునే వెసులుబాటు దక్కింది.

రైతు నెత్తిన పాలు పోశారు



లాక్‌డౌన్‌తో ప్రైవేటు డెయిరీలు మిల్క్ హాలిడేని ప్రకటించాయి. దీంతో పాలను విక్రయించుకోలేక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకొచ్చి ప్రతి రోజూ పాలను విక్రయించుకునే వెసులుబాటును కల్పించింది. పాడి రైతులకు గిట్టుబాటు ధరను అందించి ఆదుకుంది. దీంతో లీటరు ఆవు పాలకు రూ.25 నుంచి రూ.30 వరకు ధర చేతికందింది.

– లలితమ్మ, మహిళా పాడి రైతు, గుడిపాల

రవాణాకు వెసులుబాటు



లాక్‌డౌన్‌లో బెల్లం రైతుల ఇబ్బందులను తెలుసుకున్న ప్రభుత్వం వెంటనే బెల్లం రవాణాకు వెసులుబాటు కల్పించింది. ఫలితంగా బెల్లం తరలింపులో ఎలాంటి ఇబ్బందులూ లేకపోవడంతో నిత్యం రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు తరలించాం. నల్ల బెల్లం కిలో రూ.50, తెల్లబెల్లం కిలో రూ.60 మేరకు గిట్టుబాటు అయ్యింది.

– కే.ఈశ్వర్‌రెడ్డి, బెల్లం వ్యాపారి, చిత్తూరు

గిట్టుబాటు ధర కల్పించారు



లాక్‌డౌన్ సమయంలో వరి, వేరుశనగ పంటలను నూర్పిడి చేసినా మార్కెట్‌లో విక్రయించుకోలేక పోయాం. అలాంటి కష్ట సమయంలో ప్రభుత్వం ముందుకొచ్చి పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంది. అధికారులే నేరుగా ఇళ్ల వద్దకు వచ్చి వరి, వేరుశనగ పంటను కొనుగోలు చేశారు. వేరుశనగ కాయలు కిలో రూ.61 చొప్పున కొనుగోలు చేసి, వారం రోజుల వ్యవధిలోనే డబ్బులు అందించారు.

– మునివెంకటప్ప, రైతు, శాంతినగర్, పెద్దపంజాణి మండలం

మళ్లీ జగనే ముఖ్యమంత్రి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- సంక్షేమం కొనసాగాలంటే మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపించండి
- బాబు మోసాలు నమ్మవద్దు
- పూతలపట్టు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- మంత్రి పెద్దిరెడ్డి పర్యటనతో వైఎస్సార్‌సీపీలో ఫుల్‌జోష్



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన చిత్తూరు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ ర్యాలీలో ఊరేగింపుగా వెళ్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, చిత్తూరు: సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పూతలపట్టు నియోజవర్గంలోని ఐరాల, యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లె మండలాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి ఎస్.రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్‌తో కలసి ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ప్రసంగించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారని స్పష్టం చేశారు. కరోనా కష్టకాలంలో రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో పాటు పేదలకు నేనున్నా.. అన్న భరోసా కల్పించి వారి ప్రాణాలు కాపాడారని గుర్తు చేశారు. జగన్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో యువతకు 4.5 లక్షల ఉద్యోగాలను కల్పించారన్నారు. మహిళలకు ఆర్థిక చేయూతను కల్పించి అండగా నిలిచారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్‌మోహన్ రెడ్డి చెప్పిందే చేస్తారని, చేయగలిగిందే చెప్తారని స్పష్టం చేశారు. త్వరలో మళ్లీ సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేయాలంటే ప్రజలంతా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా డాక్టర్ సునీల్‌కుమార్, ఎంపీగా రెడ్డెప్పను అత్యధిక మెజారిటీతో గెలించాలన్నారు.

బాబును నమ్మకండి..

ప్రజలను మోసగించి అధికారం చేజిక్కించుకునేందుకు చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో వస్తున్నాడని, బాబు మాటలు నమ్మి మోసపోవద్దని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. గత ఎన్నికలకు ముందు ప్రజలకు 600 హామీ ఇచ్చిన బాబు ఒక్కటి కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన చంద్రబాబు సొంత జిల్లాకు ఏమీ చేయలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌తోనే సాధ్యమన్నారు.

పూతలపట్టులో ఫుల్ జోష్..

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూతలపట్టు నియోజకవర్గంలో పర్యటించడంతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చిత్తశుద్ధితో పని చేసే కార్యకర్తలను గుర్తిస్తామని మంత్రి పెద్దిరెడ్డి హామీ ఇచ్చారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి ఎస్.రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని మంత్రికి నేతలు, కార్యకర్తలు స్పష్టం చేశారు.

యాదమరిలో..

యాదమరి: రానున్న ఎన్నికల్లో రాజన్న రాజ్యం మళ్లీ అధికారంలోకి వస్తుంది.. మరో ఐదేళ్లలో రాష్ట్రంలో ఇప్పుడు అందిస్తున్న పథకాలు అన్ని అలాగే అమలు చేస్తామని విద్యుత్, అటవీశాఖ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, బీఎంఆర్ సంస్థల అధినేత మోహన్ రెడ్డి, పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ యాదమరి మండలం చెన్నారెడ్డి పల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే పెరుమాళ్లపల్లె వద్ద మనోహర్ రెడ్డి అధ్యక్షతన మంత్రి పెద్దిరెడ్డిని, ఇతర నాయకులకు పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని విమర్శించారు. 45 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చక ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో ఎన్ని పార్టీలు ఉంటే వారికి ప్యాకేజీలు ఇచ్చి, వారి కాళ్లు పట్టుకుని లోలోపల నానా తంటాలు పడుతుంటారని ఆరోపించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా చేసేందేమీ లేదన్నారు. ప్రజలు అంతా జగనన్న ఐదేళ్ల సంక్షేమ పాలనను చూసి ఓటు వేయాలని తెలియజేశారు.

నేడు ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ సోమవారం నుంచి ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా పదో తరగతికి 06, ఇంటర్ మీడియట్‌కు 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పది పరీక్షలకు 1147, ఇంటర్‌కు 4059 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

బోయకొండకు పోటెత్తిన భక్తులు



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో ఒక్కసారిగా భక్తుల రద్దీతో పెరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఆలయ ఈఓచంద్రమౌళి భక్తులకు ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



భారీ బైక్ ర్యాలీ

మండలంలోని చల్లావారిపల్లె పంచాయతీ శ్రీనివాసపురం నుంచి 1000 బైకులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీతో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తొలిరోజు దాదాపు 12 పంచాయతీల్లో ప్రచారం చేశారు. రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని, పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్, మండల కన్వీనర్ నాదమునిరెడ్డితో పాటు భారీగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – పులిచెర్ల(కల్లూరు)

'విజయ'భేరి



గుడిపాలలో జరిగిన బైక్ ర్యాలీలో పాల్గొన్న చిత్తూరు నియోజకవర్గ అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి

భర్త విజయానికి భార్య ప్రచారం



చిగర్లపల్లెలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సతీమణి దుర్గ

గుడుపల్లె: కుప్పం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్ అఖండ విజయంతో గెలిపించాలని ఆయన సతీమణి దుర్గ ప్రజలను కోరారు. ఆదివారం ఆమె మండలంలోని సోడిగానిపల్లె గ్రామ పంచాయతీ దిగువచిర్లపల్లె, ఎగువ చిగర్లపల్లె, సోడిగానిపల్లె, దిన్నెపల్లె, మల్దేపల్లె గ్రామాలలో పర్యటించారు. ఇంటింటా నవరత్న పథకాల కరపత్రాలతో ప్రచారం చేశారు. ఏయే పథకాల లబ్ధి పొందారో ఆయా కుటుంబాలను అడిగి తెలుసుకున్నారు. తమకు ఎవరి సిఫార్సులు లేకుండానే పథకాల ఫలాలు అందాయని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పథకాలు సజావుగా కొనసాగాలంటే భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, సర్పంచ్ సుశీలమ్మ, నాయకులు నారాయణస్వామి, రంగప్ప పాల్గొన్నారు.

ఇంటింటా నాయకుల ప్రచారం

మండలంలోని కంచిబందార్లపల్లె, కోటచెంబగిరి గ్రామాలలో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారంచేశారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా భరత్‌ను, ఎంపీగా రెడ్డెప్పను గెలించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, కన్వీనర్ రామక్రిష్ణ, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సార్వత్రిక ఎన్నికలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ వెల్లడి
- పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు
- అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షలు, పార్లమెంట్ అభ్యర్థి రూ.90 లక్షల వరకు ఖర్చు చేసేందుకు అవకాశం
- ఇప్పటి వరకు రూ.1.39 కోట్ల నగదు సీజ్
- శాంతిభద్రతలపై ఎస్పీ జాషువాతో సమీక్ష

సాక్షి చిత్తూరు: ఎన్నికల ప్రకటన వెలువడడంతో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఆ మేరకు జిల్లావ్యాప్తంగా ఎన్నికల కసరత్తు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జాషువా, చిత్తూరు ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల సంఘం జారీచేసిన షెడ్యూల్ మేరకు జిల్లావ్యాప్తంగా కోడ్ అమలులో ఉందన్నారు. చిత్తూరు పార్లమెంట్ పరిధిలోకి వచ్చే చంద్రగిరి నియోజకవర్గం కసరత్తు మొత్తం తిరుపతి జిల్లా యంత్రాంగం చేపడుతుందన్నారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పుంగనూరు నియోజకవర్గం కసరత్తు కూడా చిత్తూరు జిల్లా యంత్రాంగానిదే బాధ్యత అని వెల్లడించారు.

ఎన్నికలకు 1771 పోలింగ్ కేంద్రాలు..

జిల్లావ్యాప్తంగా జరిగే ఎన్నికలకు 1,771 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గత నెల రోజులుగా కొత్తగా 9 అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. మొత్తం 1771 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన 9 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌స్టేషన్ నంబర్ మారదని చెప్పారు. 1266 లొకేషన్లలో ఒకటికంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉంటాయని తెలిపారు. అర్బన్‌లో 362, రూరల్‌లో 1400 లొకేషన్‌లలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 15,56,247 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 10, 12 తేదీల్లో తుది ఓటర్ల జాబితా ఉంటుందన్నారు. విభిన్న ప్రతిభావంతుల ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో ఒక ర్యాంపు, వీల్ చైర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ ముందురోజు పంపిణీ చేస్తామన్నారు. నగరి, కుప్పం నియోజకవర్గాలు దూరప్రాంతాలు గనుక ఆ రెండు నియోజకవర్గ కేంద్రాలలో ఏర్పాటు చేసే ప్రత్యేక గొడౌన్‌లో పోలింగ్ పూర్తయిన రోజు రాత్రి భద్రపరుస్తామన్నారు. ఆ తర్వాత పీఓ పోలీసు బందోబస్తుతో ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రానికి ఎన్నికల యంత్రాలను తీసుకొస్తారన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జాషువా

శిక్షణ సమయంలోనే పోస్టల్ బ్యాలెట్..

- జిల్లాలో పనిచేస్తున్న 11 వేలకు పైగా ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌లను శిక్షణ సమయంలో అందజేయడం జరుగుతుంది.
- ప్రతి పోలింగ్ కేంద్రానికి రెండు సెట్లు ఓటింగ్ యంత్రాలు ఉంటాయి. జిల్లాలో ఎన్నికలకు 12,751 మంది ఉద్యోగులను గుర్తించడం జరిగింది.
- ఎక్కడా వలంటీర్లను ఎన్నికల కసరత్తులో వాడడం లేదు. సచివాలయ ఉద్యోగులను ఎన్నికల కసరత్తులో వినియోగిస్తాం. అంగన్‌వాడీ వర్కర్స్, ఏఎన్‌ఎం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇప్పటి వరకు ఎన్నికల కసరత్తులో వాడడం లేదు. అవసరం మేరకు వినియోగించుకుంటాం.
- ఇప్పటి వరకు 4800 మంది పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. 4,800 మందిలో మొదటి ర్యాండమైజేషన్‌లో ఎంత మందిని పోలింగ్‌కు వినియోగిస్తామన్నది త్వరలో వెల్లడిస్తాం.
- అసెంబ్లీకి రూ.40 లక్షలు, పార్లమెంట్ రూ.90 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల ఖర్చు విషయంలో నామినేషన్ వేసిన తర్వాత అభ్యర్థి ఖాతాలో పడుతుంది. అంత వరకు ఆయా గుర్తింపు పొందిన పార్టీల ఖాతాల్లో జమ అవుతుంది.
- ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చులు ఎక్కువైతే అభ్యర్థులకు నామినేషన్‌ల తర్వాత అబ్జర్వర్ ఆధ్వర్యంలో నోటీస్ ఇచ్చి ఎన్నికల బరిలో నుంచి తప్పిస్తాం.
- సీ విజిల్ యాప్‌లో ఎంసీసీ ఫిర్యాదులు చేయవచ్చు. ప్రజలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. 100 నిమిషాల్లోపు ఆ ఫిర్యాదును పరిష్కరించి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- స్టాటిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూవింగ్ టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.
- ఏప్రిల్‌కు అందజేసే ఫించన్ ఎవరితో పంపిణీ చేస్తామనేది త్వరలో వెల్లడిస్తాం.
- ఇప్పటి వరకు రూ.1.36 కోట్లు సీజ్..

విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలు	
జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ తేదీ	ఏప్రిల్ 18
నామినేషన్‌ల స్వీకరణ	ఏప్రిల్ 25
నామినేషన్‌ల పరిశీలన	ఏప్రిల్ 26
నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు	ఏప్రిల్ 29
ఎన్నికల పోలింగ్	మే 13
ఓట్ల లెక్కింపు	జూన్ 04
పోలింగ్‌కేంద్రాలు	1771
విభిన్నప్రతిభావంతుల ఓటర్లు	23,503
85 ఏళ్లకు పైబడిన వృద్ధ ఓటర్లు	5167
ఎన్‌ఆర్‌ఐ ఓట్లు	167
సర్వీస్ ఓట్లు	3375
కొత్తగా ఓటు వేయనున్న యువత	36,083
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు	415

జిల్లావ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ నాటికి అక్రమంగా తరలిస్తున్న రూ.1.3 కోట్ల నగదును సీజ్ చేయడం జరిగిందని ఎస్పీ జాషువా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 30 యాక్ట్ అమల్లో ఉందన్నారు. 235 బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అక్రమంగా తరలిస్తున్న 8300 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేసి 514 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎలాంటి అలజడులు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి కేంద్రం నుంచి ప్రత్యేక బలగాలు జిల్లాకు వచ్చాయన్నారు. ఎన్నికల విధుల పట్ల ఇప్పటికే పోలీసులకు శిక్షణ ఇచ్చామని చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రచారం, సమావేశాల నిర్వహణకు ముందస్తుగా సంబంధిత డివిజన్ డీఎస్పీల వద్ద అనుమతులు పొందాలన్నారు.

ఎన్నికల వేళ.. కండువాల రాజకీయం

- జంప్ జిలానీలకు ఇదో పండగ
- కండువా వేసుకోవాలంటే గుడి, బడి పేరిట చందాల బేరం
- అభ్యర్థులకు షాక్‌లు ఇస్తున్న కొందరు చోటామోటా నాయకులు

పలమనేరు: తెలివి ఒక్కరిసొత్తు కాదన్నట్టు ఎన్నికల వేళ గ్రామాల్లో కొందరు నేతలకే షాకిలు ఇస్తున్నారు చోటామోటా నాయకులు. ఆ గ్రామానికి ఫలానా నేత ప్రచారానికి వస్తున్నాడని తెలిస్తే చాలు. గ్రామంలోని కొందరు యువకులను సిద్ధం చేసుకుంటున్నారు. భారీగా పార్టీ మారుతామంటూ చిన్నపాటి నేతలకు లీకులిస్తున్నారు. దీంతో ఆ నేత ఆనందపడి అన్నా మా ఊర్లో చాలా మంది యూత్ మన పార్టీలో చేరతారంట, మీరు రావాల్సిందేనని పట్టుబట్టి ఆయా పార్టీ అభ్యర్థులను రప్పిస్తున్నారు. తీరా అభ్యర్థి ఆ గ్రామంలోకి వెళ్లగానే అన్నా మా గ్రామంలో కొత్తగా కట్టే గుడికి రూ.లక్ష చందా ఇస్తే కండువాలు కప్పుకుంటామని షరతు పెడుతున్నారు. దీంతో అవాక్కైన అభ్యర్థి చేసేదిలేక తప్పకుండా సాయం చేద్దామబ్బా అంటూ కమిట్ కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆపై గ్రామంలో హంగామా మధ్య అభ్యర్థికి భారీ పూలమాలవేసి కండువాలు కప్పుకునే కార్యక్రమం మొదలవతుంది. దీన్ని అక్కడే కొందరు సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి సోషల్‌మీడియాలో వైరల్ చేయడం ఇప్పుడో ఫ్యాషన్‌గా మారింది. ఇలాంటి సంఘటనలు పలమనేరు నియోజకవర్గంలో ఇప్పటికే మొదలైయ్యాయి. ఒక గ్రామాన్ని చూసి మరో గ్రామస్తులు ఇలాంటి చందా కార్యక్రమాలకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఓ పార్టీ అభ్యర్థి కాకుంటే ఇంకో అభ్యర్థికి గాలం వేస్తున్నారు. దీన్నంతా చూస్తున్న జనం అబ్బా ఏమి తెలివిరా వీళ్లకు చందాలు తీసుకోవడం ఆపై కండువాలు కప్పుకోవడం, ఇంకెవరైనా ఇంకా ఎక్కువ ఇస్తామంటే మళ్లీ ఆ పార్టీ కండువాలు కప్పించుకోవడం భలేగుంది సామీ వీరి తెలివి అని ముక్కున వేలేసుకుంటున్నారు. ఎన్నికల సమయం గనుక చేసేది లేక గ్రామాల్లోకి వెళ్లే సీనియర్ నాయకులు సైతం కిమ్మనకుండా వాళ్లు చెప్పినట్టు చేస్తున్నారు. మళ్లీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుంటే వీరి పని గోవిందే. అప్పుడు సీన్ రివర్స్ కాక తప్పదు. అభ్యర్థులు గ్రామాల్లో ప్రచారానికి వస్తే డబ్బు పెట్టేది తామైతే, కండువాలు మార్చుకున్న వారికేమో మర్యాదలు, చందాలా అని పార్టీలోని సీనియర్ కార్యకర్తల బాధ. ఇది ప్రస్తుతం నియోజకర్గంలో నడుస్తున్న కొత్త ప్రచార రాజకీయం.

ఆర్టీఓ చెక్‌పోస్టుకు మంగళం

తడ: మండలంలోని జిల్లా సరిహద్దుల్లో ఉన్న బీవీపాళెం రవాణా శాఖ కార్యాలయం వద్ద తనిఖీలను నిలుపుదల చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కార్యాలయంలో లాగిన్‌లు నిలిపి వేయడంతో వాహనాల పర్మిట్లు, తనిఖీలు నిలిచిపోయాయి. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎన్నికల నేపథ్యంలో చేపట్టే తనిఖీలను మాత్రమే నిర్వహిస్తున్నారు. దీనిపై సోమవారం పూర్తి వివరాలతో స్పష్టత వస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

జగనన్న హయాంలో మహిళలకు పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత
- గీతాంజలికి నివాళి

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న హయాంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత తెలిపారు. ఆదివారం తేనబండలో జిల్లా మహిళా అధ్యక్షురాలు లీనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆ విభాగం జిల్లా జనరల్ బాడీ మీటింగ్‌కు విచ్చేసిన ఆమె మాట్లాడారు. దాదాపు ఐదేళ్ల జగనన్న పరిపాలన సంక్షేమం, అభివృద్ధితోనే సాగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికంగానే సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. మహిళలకు పెద్దపీట వేస్తూ అమ్మఒడి మొత్తం తల్లుల ఖాతాల్లో పడుతోందన్నారు. ఇంటి పట్టాలు మహిళల మీద ఇస్తున్నారని చెప్పారు. పదవులు, పనుల్లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అందరూ సమిష్టిగా కలిసి పార్టీని గెలిపించుకోవాలని లీనారెడ్డి కోరారు. గతేడాది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలోని 50 వేల మంది మహిళలకు చీరలు అందించామని చిత్తూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి గుర్తు చేశారు. అనంతరం గీతాంజలి మృతి సందర్భంగా క్యాండిల్ వెలిగించి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి శైలజ, మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శశికళ, పశ్చిమ రాయలసీమ విభాగ మహిళ కోఆర్డినేటర్ మహిత ఆనంద్, స్థానిక కార్పొరేటర్ గంగ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గీతాంజలి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పోతుల సునీత, చిత్తూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి

ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నగరి : స్థానిక కామాక్షీ సమేత కరకంటేశ్వర ఆలయంలో ఆదివారం ధ్వజారోహణంతో పంగుణోత్తర తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం హోమం చేసి మూలవర్లకు అభిషేకం చేశారు. పిదప ఉత్సవ మూర్తులకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. సాయంత్రం సూర్యప్రభ వాహనంపై కామాక్షి సమేత కరంటేశ్వర స్వామి ఊరేగింపుగా బయలుదేరారు. సోమవారం చంద్రప్రభ వాహనం, మంగళవారం అధికార నంది వాహనం, 20న శేష వాహనం, 21న వృషభ వాహనం, 22న గజవాహనం, 23న రథోత్సవం, 24న కల్యాణోత్సవం, 25న రావణ వాహన సేవలు జరగనున్నాయి. అదే రోజున నిర్వహించే ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు.



ధ్వజారోహణం పూజలు చేస్తున్న పురోహితులు, (ఇన్‌సెట్) సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న కరకంటేశ్వరుడు

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ అవకాశం
- మాస్‌కాపీయింగ్ జరగకుండా పటిష్ట చర్యలు
- ఈసారి ప్రశ్నపత్రాలపై క్యూఆర్ కోడ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పది పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. సోమవారం జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షకు జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 21,199 మంది పరీక్షలు రాయనున్నారు, బాలురు 10,912 మంది, బాలికలు 10,287 మంది ఉన్నారు. ప్రైవేట్ అభ్యర్థులు 1,395 మంది రాయనున్నారు. ఈపరీక్షల నిర్వహణకు 116 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 116 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 116 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్వహిస్తారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, పరీక్షలు సజావుగా నిర్వహించేలా జిల్లాలోని అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. జిరాక్స్ సెంటర్లను కూడా మూసివేయనున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు.

సకాలంలో చేరుకోవాలి..

పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కేంద్రాల వద్దకు గంట ముందుగా చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. విద్యార్థులు పరీక్షల హాల్‌టికెట్ చూపించి ప్రయాణించవచ్చని ఉత్తర్వులు జారీచేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను విద్యార్థులు తీసుకెళ్లకూడదు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోపలకు అనుమతిస్తారు.



పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన డెస్కులు

పదో తరగతి పరీక్షల వివరాలు..	
పది పరీక్ష కేంద్రాలు	116
హాజరుకానున్న రెగ్యులర్ విద్యార్థులు	21,199
ప్రైవేట్ విద్యార్థులు	1395
మొత్తం విద్యార్థులు	22,594
సమస్యాత్మక కేంద్రాలు	06
ఇన్విజిలేటర్లు	1096

మాస్ కాపీయింగ్ కట్టడికి చర్యలు....

పదో తరగతి పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. జిల్లాలోని అన్నికేంద్రాల్లో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేలా 06 ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో పోలీస్, ఇతర శాఖలతో కలిపి లోపల, బయట మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లాలో గతంలో పేపర్ లీకై వాట్సాప్ గ్రూప్‌ల్లో చక్కర్లు కొట్టింది. అలాంటి పరిస్థితులు ఈసారి తలెత్తకుండా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు అన్ని పరీక్ష కేంద్రాలను సెల్‌ఫోన్ రహిత సెంటర్లుగా మార్చా రు. మాస్‌కాపీయింగ్ కట్టడికి ఈసారి ప్రశ్నపత్రాలపై క్యూ ఆర్ కోడ్‌ను ముద్రించారని అధికారులు వెల్లడించారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు



పదో తరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగింది. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించాం. పరీక్ష విధుల్లో ఉండే వారెవరూ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లకూడదు. అలా తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఎలాంటి సందేహాలు ఉన్నా 9032185001 నంబర్‌లో సంప్రదించాలి. మీడియాకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదు. పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్.

- షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, చిత్తూరు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్

- వ్యక్తి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన హరిబాబు

బంగారుపాళెం: మండలంలోని కల్లూరుపల్లె వద్ద శనివారం సాయంత్రం విద్యుత్ స్తంభాన్ని బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్సకు తరలిస్తుండగా వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. గంగవరం మండలం గుండుగల్లు గ్రామానికి చెందిన హరిబాబు, శ్యామ్ మండలంలోని కల్లూరుపల్లె సమీపంలో హరి ఇటుకల బట్టీలో పని చేస్తున్నారు. బంగారుపాళెం నుంచి కల్లూరుపల్లెకు ద్విచక్రవాహనంపై పోతుండగా రహదారి పక్కన గల విద్యుత్ స్తంభాన్ని అదుపుతప్పి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో హరిబాబు(26), శ్యామ్(22) ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ప్రథమ చికిత్స కోసం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హరిబాబు పరిస్థితి విషయంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.